

## డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్‌కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటుచేశారు. జిల్లా కౌన్సిల్ సమావేశం మహేంద్రాచార్య అధ్యక్షతన సాగింది. నూతన అధ్యక్షుడిగా బి.చంద్రనాగ కాంత్ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా ఎం.మహేంద్రాచారి ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం 20శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.




● నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ సమీపంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం ఇదే..

● ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి ఏర్పాటు చేసిన బోర్డు ఇదే..

# ఆయిల్‌పామ్ పరిశ్రమపై నీలినీడలు!

- గందరగోళంలో రైతులు
- జూన్‌లో పంట దిగుబడి
- కొనుగోళ్లపై కొరవడిన స్పష్టత
- రెండేళ్లు గడిచినా నేటికీ ప్రారంభం కాని పనులు
- ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసిన హార్టి కల్చర్ శాఖ

నిర్మల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని లెఫ్ట్ పోచంపాడ్ - పాక్‌పట్ల గ్రామాల మధ్య ఏర్పాటు చేయతలపెట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు ఇప్పటివరకు మొదలుకాకపోతుండడంతో ఆ పంటను సాగుచేస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జూన్ నెలలోగా పంట చేతికి రానున్న నేపథ్యంలో ఆ పంటను ఎక్కడ అమ్ముకోవాలనే అంశంపై రైతులు గందరగోళానికి గురవుతున్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 15 ఎకరాల్లో దశల వారిగా ఆయిల్‌పామ్ పంటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో మొదట జిల్లావ్యాప్తంగా 3,500 ఎకరాల్లో పంట సాగును చేపట్టారు. రాబోయే జూన్ వరకు మొదటి దశ కిం ద సాగైన ఆయిల్‌పామ్ పంట దిగుబడి రైతుల అందబోనుంది. అయి తే ఈ పంటను ఎక్కడ అమ్ముకోవాలనే విషయంలో రైతులు ఇప్పటినుంచే ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు, కొనుగోలు బాధ్యతను ప్రీ యూనిక్ అనే కంపెనీ తీసుకుంది. సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ - పాక్ పట్ల వద్ద గల ఆయిల్ పాం ఫ్యాక్టరీ ని ఏర్పాటు చేసేందుకు ఈ కంపెనీ అన్ని ఏర్పాట్లు పూరి చేసింది. 2023 సంవత్సరంలో ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. కాగా జిల్లా లో సాగయ్యే ఆయిల్‌పామ్ పంటను తమ కంపెనీ కొనుగోలుచేసి ఇక్కడి పరిశ్రమలో ఆయిల్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు ప్రీ యూనిక్ కంపెనీ ప్రకటించింది. స్థానికంగానే కొనుగోలు జరిగే అవకాశం ఉండడంతోపాటు ఈ పంటల సాగుపై అప్పటి ప్రభుత్వం అలాగే సదరు ప్రైవేటు కంపెనీ పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో రైతులంతా ఉత్సాహంగా ఈ పంటను సాగుచేశారు. మొదటి దశలో భాగంగా 3,500 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే రెండో దశ కింద కూ డా మరో 3,500 ఎకరాల్లో ఈ పంట సాగు మొదలైంది.

### ఆర్భాటంగా మొదలైన సాగు..

జిల్లాలో పాత పంటలను పక్కన పెట్టి ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలంటూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఆ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులందరూ ఈ పంటను సాగుచేయాలం టూ రైతులను కోరారు. అలాగే పలువురు రై తులను క్షేత్రస్థాయి పర్యటనకు కూడా తీసుకువెళ్లారు. హార్టికల్చర్ శాఖతోపాటు వ్యవసా యశాఖ అధికారులు సైతం ఈ పంట సాగు చేపట్టాలంటూ రైతులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీనికి తోడు ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేసే ప్రైవేటు సంస్థ కూడా రైతులకు అవగాహన కల్పించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టింది. దీంతో రైతులు చాలాచోట్ల ముందుకు వచ్చి తాము ఏళ్ల నుంచి సాగుచేస్తున్న పంటలను పక్కన పెట్టి ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రాధాన్యమిచ్చారు. అనుకున్నట్లుగానే రైతు లు లక్ష్యానికి మేర రైతులు ఆయిల్ పామ్ పంటను ఉత్సాహంగా సాగు చేశారు. అన్నిరకాల మేళకువలను పాటించడంతో ప్రస్తుతం ఈ పంట దిగుబడి చేతికొచ్చే పరిస్థితి ఉంది. జూన్ మాసం వరకు ఈ పంట పూర్తిస్థాయిలో దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. పంట మరో రెండు మూడు నెలల్లో చేతికి రానున్నప్పటికీ ఈ పంటను కొనుగోలు చేసే సారే లేకపోవడం, అలాగే కొనుగోలు చేస్తామని హామీనిచ్చిన ప్రైవేటు సంస్థ ప్రతినిధులు సైతం ఇప్పటివరకు ఈ దిశగా స్పందించకపోతుండడంతో ఈ పంటను సాగు చేస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



శంకుస్థాపన రోజు ఆవిష్కరించిన శిలాఫలకం

### శంకుస్థాపనకే పరిమితమైన ఫ్యాక్టరీ పనులు

జిల్లాలోని సోన్ మండలం పాక్‌పట్ల లెఫ్ట్ పోచంపాడ్ గ్రామాల వద్ద 2023 అక్టోబర్ 4న యూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి భూమిపూజ చేసింది. కార్యక్రమానికి అప్పటి మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు సదరు కంపెనీ ఎలాంటి పనులు మొదలుపెట్టలేదు. శంకుస్థాపన కోసం నిర్మించిన శిలాఫలకాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫ్యాక్టరీ నిర్మాణ పనులపై కంపెనీ యాజమాన్యం ఇప్పటి వరకు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు ఇప్పటికే పలుసార్లు కంపెనీ యాజమాన్యానికి నోటీసులు పంపారు. పంట సాగు విషయంలోనూ ఇక్కడి బీరవెల్లి వద్ద ఏర్పాటు చేసిన నర్సరీ నుంచి మొక్కలను విక్రయించే సమయంలోనూ చూపినంత ఉత్సాహం ఇప్పుడు ఈ కంపెనీ చూపడం లేదంటున్నారు. కంపెనీ ఫ్యాక్టరీ ఏర్పాటు కాకపోతే పంటను ఎలా కొనుగోలు చేస్తుందన్న ఆందోళనతో రైతులు సతమతమవుతున్నారు.

### గాలిలో దీపంలా ఉంది మా బతుకు

● ముత్యంరెడ్డి, ఆయిల్‌పామ్ రైతు, కంజర్



అధికారుల మాటలు నమ్మి ఎనిమిది ఎకరాల్లో ఆయిల్ పాం పంటను సాగు చేశాను. నెల రోజుల్లో పంట కోతకు వస్తుంది. అప్పుడు ఇక్కడే ఆయిల్ పాం పరిశ్రమ పెడతామని చెప్పారు. కొబ్బరికాయ కొట్టి వెళ్లారు తప్ప పరిశ్రమ పనులు ప్రారంభం కాలేదు. పంటలను ఎ క్కడికి తీసుకువెళ్ళాలో అర్థం కావడం లేదు. ఇప్పుడు నా పరిస్థితి గాలిలో దీపంలా అయ్యింది.

### రైతులతో కలిసి ఉద్యమిస్తాం

● అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి



జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రైతులతో కలిసి ఉద్యమానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో ఫ్యాక్టరీ నిర్మాణం కాకుండా ఇద్దరు ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారు. వారి సూచనల మేరకే ఓ ఇరిగేషన్ అధికారి నోఅబ్జక్షన్ పత్రం ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీ నిర్మాణం జాప్యంతో ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల రైతాంగంలో ఆందోళన నెలకొంది. దీన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం.

### షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఉద్యానవన శాఖ

ప్రీ యూనిక్ కంపెనీ నేటికీ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి పనులు మొదలుపెట్టకపోవడంతో ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు ఆ కంపెనీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి కంపెనీ యాజమాన్యానికి హార్టికల్చర్ శాఖ షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలోనే రైతుల నుంచి ఈ పంటను ప్రీ యూనిక్ కంపెనీ యాజమాన్యం కొనుగోలు చేయాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీనికోసం ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న అన్నిచోట్ల ఫ్లెక్సీ బ్యానర్లతో ప్రచారం చేపట్టాలంటూ అధికారులు కంపెనీ యజామాన్యాన్ని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఆత్రం భుజంగ్ రావు

## పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలం

● మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ్‌రావు

కడెం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణ పేరుతో అమాయక గిరిజన కుటుంబాలను ఉన్నచోట నుంచి వేరే ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావు అన్నారు. ఆదివారం కడెం మండలంలోని కొత్త మైసంపేట గ్రామాన్ని మానవ హక్కుల నిజనిర్ధారణ కమిటీతో కలిసి సందర్శించారు. ప్రతీ కుటుంబానికి ఐదు ఎకరాల భూమి ఇస్తామని చెప్పి రెండు ఎకరాల భూమి మాత్రమే ఇచ్చారని ఆరోపించారు.

## ఐఎంఏ జాతీయ ఎథిక్స్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ చక్రధారి



డాక్టర్ చక్రధారి

నిర్మల్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఐఎంఏ జాతీయ స్టాండింగ్ కమిటీ ఫర్ ఎథిక్స్ కన్వీనర్‌గా నిర్మల్‌కు చెందిన ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ చక్రధారి నియమితులయ్యారు. చక్రధారి రాష్ట్ర ఐఎంఏ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈసందర్భంగా చక్రధారి జాతీయ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలికి, రాష్ట్ర జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవికి న్యాయం చేస్తానని చక్రధారి ఒక ప్రకటనలో తెలిపారు.

## అందుబాటులో ఎరువులు: సీఈవో

ముథోల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (బిద్రెల్లి శాఖ) ముథోల్, బాసరలో యూరియా, గ్రోమోర్ 20:20:0:13, పొటాష్ ఎరువులు అందుబాటులో ఉంచినట్లు సీఈవో సాయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువులు అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు తీసుకొని సంఘం కార్యాలయంలో సంప్రదించగలరని పేర్కొన్నారు. యూరియా ధర రూ.267, గ్రోమోర్ 20:20:0:13 ఎరువు సంచి ధర రూ.1,280, పొటాష్ ధర రూ.1,480 ఉందని తెలిపారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిర్మల్ - 99854 03060
భైంసా - 81258 56776
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

కామారెడ్డి మారథాన్ రన్‌లో

## ఖానాపూర్ బృందం ప్రతిభ

● 2 గంటల్లో 21 కిలో మీటర్లు పూర్తి చేసిన వైద్యుడు కిరణ్ కుమార్



కామారెడ్డిలో ఆఫ్ మారథాన్‌లో పరుగు పూర్తిచేసి మెడల్స్ పొందిన ఖానాపూర్ బృందం



2 గంటల్లో 21 కిలోమీటర్ల పరుగు పూర్తి చేసిన కిరణ్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రతినిధి

ఖానాపూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితుల సహాయార్థం పద్మశాలి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డిలో నిర్వహించిన మారథాన్ రన్ (21 కిలో మీటర్లు)లో ఖానాపూర్ బృందం ప్రతిభ కనబరిచింది. ఈ ఆఫ్ మారథాన్‌లో ఖానాపూర్‌కు చెందిన వైద్యులు అయిల్నేని కిరణ్‌కుమార్, నువ్వుల రాజేందర్, రాపెల్లి రాజు యాదవ్, రిపోర్టర్ అశోక్, వెంకట్రాములు, అడ్వకేట్ బాశెట్టి శివ, ఎమ్‌డీ ముషారఫ్, మహేష్, నువ్వుల దత్తుల బృందం పాల్గొని విజయవంతంగా మారథాన్ రన్‌ను పూర్తిచేశారు. ఈ ఆఫ్ మారథాన్ పరుగులో ఖానాపూర్‌కు చెందిన వైద్యులు కిరణ్ కుమార్ 2.05 గంటల వ్యవధిలోనే 21 కిలో మీటర్ల పరుగును పూర్తి చేసి మన్ననలు పొందారు. గతంలో ముంబైలో నిర్వహించిన 42 కిలోమీటర్ల మారథాన్ పోటీల్లో సైతం పాల్గొన్న వైద్యులు కిరణ్‌కుమార్ విజయవంతంగా పూర్తి చేసి మెడల్ సాధించిన విషయం విధితమే. తాజాగా కామారెడ్డిలో సైతం ఆఫ్ మారథాన్ (21 కిలోమీటర్లు) పరుగును వేగంగా పూర్తి చేసిన జాబితాలో కిరణ్‌కుమార్ సైతం ఉండడం పట్ల స్థానికులు ఆయనను అభినందిస్తున్నారు. ఖానాపూర్‌కి చెందిన 900 మంది బృందం ఆఫ్ మారథా న్‌ను విజయవంతంగా పూర్తిచేసి నిర్వాహకుల చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు.

## దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళి

నిర్మల్ అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం మార్చి 2న రాష్ట్ర వేడుకగగా నిర్వహించింది. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ స్వర్గీయ శ్రీపాద రావు సర్పంచ్‌గా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్‌గా సేవలందించారన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాల్లో పాలుపంచుకొని ప్రజా నాయకుడిగా ఎదిగారన్నారు. ఈ సందర్భంగా శ్రీపాద రావు సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శివరాజ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

### శ్రీపాదరావుకు ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు జయంతిని ఆదివారం జిల్లా సాయుధ దళ ముఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు సేవలను గుర్తు చేసుకున్నారు. ఆర్ఐలు రాంనిరంజన్, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఎస్సైలు వినోద్, రవి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సాయుధ దళ పోలీసులు



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేస్తూ..



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

మామడ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాస్తాపూర్ గ్రామానికి చెందిన గంగారాం పటేల్ భార్య మాజీ సర్పంచ్ సీతాబాయి ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట సంతోష్, మాజీ సర్పంచ్ రాందాస్, లింగు, సీతారామ్, భాస్కర్, పాకాల రాంచందర్ ఉన్నారు.

## తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ సరికాదు

● సుంకెట పోశెట్టి, తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్

ముథోల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీసీల ముద్దు బిడ్డ చింతపడు నవీన్ (తీన్మార్ మల్లన్న)ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ చేయటం సరికాదని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీర్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడమంటే యావత్ తెలంగాణ బీసీలందరికీ అవమాన పరచడమేనని పేర్కొన్నారు. దీనిని బీసీ సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీల గొంతు కోసం ప్రశ్నించడమే మల్లన్న చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ఒకరిపై ఒకరు విమర్శలు చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్‌కు లేని సస్పెన్షన్ ఒక బీసీ బిడ్డకు ఎందుకని ఈ సందర్భంగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రకులాల వారు ఏం చేసినా తప్పు లేదు కానీ బీసీలు మాత్రం నోరు నేరమైనట్లు కాంగ్రెస్ వ్యవహరిస్తోందని తెలిపారు. ఒకవైపు అగ్రకులాల వారు పార్టీలో ఉండి ఎదిరిస్తే మాత్రం కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తామని అంటారని, మరి బీసీలు ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా.. ఇదెక్కడి న్యాయమని పేర్కొన్నారు. మల్లన్నను సస్పెన్షన్ చేసేది ఎమ్మెల్సీ ఎన్నికలకంటే ముందే కానీ ఎన్నికైన తర్వాత సస్పెన్షన్ చేయడమంటే కాంగ్రెస్ పార్టీకి బీసీలంటే భయముందని తెలిపారు. అందుకే ఎన్నికల తర్వాత మల్లన్నను సస్పెన్షన్ చేశారని, కాంగ్రెస్ పార్టీకి దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందే చేయాల్సిందని పేర్కొన్నారు. ఇకనైనా బీసీలు అంతా మల్లన్న సస్పెన్షన్‌ను ఖండిస్తూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీల సత్తాను చాటి కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిద్దామని పేర్కొన్నారు.

### ఎమ్మెల్సీ సస్పెన్షన్ సరికాదు

నిర్మల్ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ చింతపండు నీన్ (తీన్మార్ మల్లన్న)ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం సరికాదని బీసీ మహాసభ రాష్ట్ర కార్యదర్శి యాటకారి సాయన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యావత్ బీసీ వర్గాన్ని అవమానపరచడమేనని తెలిపారు.

## పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సుల అందజేత

నిర్మల్ కల్చరర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులకు తైక్వాండో జాతీయ క్రీడాకారుడు అక్షయ్ ఆదివారం పరీక్ష రాసేందుకు ప్యాడ్, జామెట్రీ బాక్సులను అందజేశారు. హెచ్ఎం నీరజారాణి, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు డి. సోమేష్, తదితరులు పాల్గొన్నారు.


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆదివాసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు, నాయకులు

## ఆదివాసీ విజ్ఞాన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కోవ

గుడిహత్నూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విజ్ఞాన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మోకాశి అన్నారు. మండల కేంద్రం సమీపంలో ఉట్నూర్ వెళ్ళే రోడ్డు పక్కన మన్కపూర్ గ్రామం దగ్గర ఆదివాసీ విజ్ఞాన కేంద్రాన్ని ఆదివాసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి, రిటైర్డ్ డీఎంహెచ్వో డాక్టర్ తోడషం చందు, ప్రాముఖ వ్యాపారవేత్త ఏలేటి అశ్విన్‌రెడ్డి ఆదివాసీ గ్రామ పటేళ్లలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ సమాజ పరిరక్షణకు, సంస్కృతీ, సంప్రదాయాల మనుగడ కోసం ఆదివాసీ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించడం శుభపరిణామన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రతి ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపుతూ ప్రభుత్వాలకు, అధికారులకు వారధిగా ఉండాలని, అలాగే ఆదివాసీల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. విజ్ఞాన కేంద్రాన్ని అన్ని రంగాలలో, అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు ఐటీడీఏ, ప్రభుత్వం చేయుతానివ్వల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ విజ్ఞాన కేంద్రం ద్వారా ఆదివాసీ సమాజం ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు తమ జాతి పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల ప్రధాని మాన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్న తోడషం కైలాస్‌ను ఆదివాసీ సేన ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. అనంతరం చలివేంద్రం అంబలి కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి కోమురం అనిల్ కుమార్, ఏఈడబ్ల్యూసిపి జిల్లా కార్యదర్శి కోవ నాగోరావ్, ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోట్నక గణపతి, ఆదివాసి సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పేందూర్ శ్రీనివాస్, రాయి సెంటర్ సార్మేడిలు పేందోర్ జైరాం, కాత్లె భారత్, ఆదివాసి గ్రామ పటేళ్ల పోరం అధ్యక్షులు ఆత్రం భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

## మటన్ దుకాణాల వద్ద జనం బారులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని మటన్ దుకాణాల వద్ద ఆదివారం ప్రజలు బారులు తీరారు. ఇటీవల బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ కారణంగా మటన్ దుకాణాలకు మాసం ప్రియులు క్యూ కడుతున్నారు. దీనికి తోడు ఆదివారం సెలవు దినం కావడంతో షాపులు కిటకిటలాడాయి. కాగా, కేజీ రూ.700 నుంచి 750 వరకు ధర పలుకుతోంది. మరోవైపు ఇప్పుడిప్పుడే చికెన్ అమ్మకాలు సైతం ప్రారంభమయ్యాయి.


పట్టణంలో మటన్ దుకాణం వద్ద గుమిగూడిన జనం


మొక్కులు చెల్లించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, భక్తులు


పూజలు అందుకుంటున్న భీమన్న దేవత విగ్రహాలు

# ఘనంగా భీమన్న దేవుడి జాతర

● ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తా : ఆడె గజేందర్

బోథ్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామం సమీపంలో గల భీమన్న దేవుడి జాతర ఘనంగా కొనసాగుతోంది. ఆదివారం జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో జాతరకు తరలి వచ్చారు. ఆ తర్వాత ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ధనూర్ గ్రామమంతా భీమన్న జాతరలో భక్తిశ్రద్ధలతో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. జాతరలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటికే నాలుగు లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఆ నిధులతో షెడ్డు నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ఇవ్వడం జరుగుతుందని ఆలయ కమిటీ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాళ్ల ఇంద్రసేనారెడ్డి, నాయకులు ఎడమల రమణారెడ్డి, భోజా రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కిట్టుడు అగుస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

ఉట్నూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రత్నసాన్వి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు సత్యరాజ్ ఉపారపు అన్నారు.ఆదివారం ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆందోలి గ్రామ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, పరీక్ష సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని అందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు సన్నద్ధం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు కాంబ్లె అతీస్‌కుమార్, అరీఫ్, జాదవ్‌సంతోష్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ మారుతి, అభిషేక్, ఉపారపు శ్రీనివాస్ తదితరులున్నారు.

● విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేస్తున్న దృశ్యం →



## బోథ్‌లో పోలీసు బందోబస్తు

బోథ్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇరు వర్గాల యువతీ, యువకుని పెళ్లి వ్యవహారం మండల కేంద్రంలో ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు శనివారం నుంచి బందోబస్తు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసు అధికారులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను తప్పించారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని పలు కాలనీలలో పోలీసులు పహారా కాస్తున్నారు. ప్రధాన కూడళ్లు అయిన భగత్ సింగ్ చౌక్ బస్టాండు గాంధీ చౌక్, తదితర వార్డుల్లో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది.

## ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన సడలించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 02 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ మాదిగ జేఏసీ, గిరిజన సంఘాల సమావేశం నిర్వహించారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ బోర్డు పరీక్షల్లో నిమిషం నిబంధనను సడలించాలని కోరారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా కనీసం 15 నిమిషాల సమయం వరకు పరీక్ష కేంద్రంలోనికి వెళ్లడానికి అనుమతించాలన్నారు. ఆదివాసీ నాయకులు కడప సోనేరావు, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ


మారుమూల గిరిజన గ్రామం ఉమాపతి కుంట

## రోడ్ల అభివృద్ధికి అనుమతులేవి?

(5వ పేజీ తరువాయి...)

లింగాపూర్, సిర్పూర్(యూ), మండలాల్లోని 10 రోడ్ల నిర్మాణానికి రూ.16.34 కోట్ల వ్యయంతో 15కిలోమీటర్ల రోడ్లు నిర్మించాలని భావించగా 9కిలోమీటర్ల రోడ్లు అడవుల గుండా ఉన్నాయి. అదేవిధంగా నిర్మల్ జిల్లాలోని కడెం మండలంలో గల పాండవపూర్ బీటీ రోడ్డు నుంచి డ్యాంగూడ రోడ్డు, పెంబి మండలంలోని బీటీ రోడ్డు నుంచి రాయగడ మీదుగా బోధమల్ల, పోచంపల్లి రెండు రోడ్ల నిర్మాణానికి రూ.3.42 కోట్ల వ్యయంతో ఐదు కిలోమీటర్ల రోడ్లు నిర్మించాలని భావించగా.. మూడున్నర కిలో మీటర్ల రోడ్లు అడవుల గుండా ఉండడంతో అటవీ శాఖ అనుమతులు లభించ లేదు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు లభిస్తాయని గిరిజన ప్రాంతాల ప్రజలు భావిస్తున్నారు.


నర్సాపూర్(బి) వాగుపై వంతెన నిర్మాణాన్ని అడ్డుకున్న అటవీ శాఖ

## భార్య మందలించిందని ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భార్య మందలించినందుకు భర్త పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు టూ టౌన్ ఏఎస్సై ముకుంద్ రావు తెలిపారు. మహారాష్ట్ర కిన్వట్ తాలూకా దైహిలీకు చెందిన నూకల్వార్ ఓంప్రకాశ్ (35) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో.. భర్త తరచుగా మద్యానికి బానిసవడంతో పిల్లలు, కుటుంబం భవిష్యత్తు ఏమైపోతుందని భార్య మదలించింది. దీంతో శనివారం చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆస్పత్రికి తీసుకువచ్చే లోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు టూ టౌన్ ఏఎస్సై ముకుంద్ రావు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## భుక్తాపూర్ సమీపంలో ఆటో బోల్తా

● ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్మల్ జిల్లా ఝరి జామిని తాలూకా సత్తుపల్లికి చెందిన పది మంది ఆదిలాబాద్‌కు ఆటోలో వచ్చారు. భుక్తాపూర్ కాలనీ సమీపంలోని సాయిబాబా గుడి నుంచి ఆటోలో వెళ్తుండగా మరో ఆటో ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదే విధంగా పంజాబ్ కూడలి వద్ద మరో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇంద్రవెల్లి మండలంలోని తుమ్మగూడకు చెందిన ఆటో డ్రైవర్ పనిరాజ్(20) పాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ కార్తీక్ సింగ్, పైలట్ రాములు బాధితులకు ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.


యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

## ఆదివాసీలకు అండగా ఉంటాం

● ఏఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం తిర్యాణి మండలంలోని గోవెన, కుర్సిగూడ, నాయకపుగూడ, లింగగూడ గ్రామాల్లో కాలినకడన పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోను కావద్దన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించు కోవాలన్నారు. యువత మావోయిస్టుల మాటలకు ఆకర్షితులు కావద్దని చెప్పారు. లక్ష్యం చేరుకునేందుకు యువత చదువుపై దృష్టి పెట్టాలన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న శంభురావు అనే బాలుడిని పరామర్శించారు. త్వరలోనే మెరుగైన చికిత్స అందేవిధంగా పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సీఐ బుద్దే స్వామి, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

సిర్పూర్(యు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు అన్నారు. వారం రోజులుగా మండల కేంద్రంలోని మహాదేవ్ జాతరలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. కెరమెరి అంబారావుగూడ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండో బహుమతి సిర్పూర్(యు) మండలంలోని నేట్నూర్ జట్టు కైవసం చేసుకుంది, లింగాపూర్ మండలంలోని జంగుగూడ జట్టు మూడో బహుమతి గెలుచుకుంది. గెలుపొందిన జట్లుకు ఎస్సై రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావు, వైస్ చైర్మన్ ఆత్రం గోవింద్‌రావు, పూజరి ఆత్రం శ్రీరావు, నాయకులు ఆత్రం భీంరావు, కుమ్ర భీంరావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై రామకృష్ణ

# కుభీర్‌లో రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు


ఫైనల్ పోటీకి సిద్ధమైన మల్లయోధులు

కుభీర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయ జాతరలో భాగంగా ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ కుస్తీ పోటీలకు జిల్లా వాసులతో పాటు పొరుగు మహారాష్ట్రలోని నాందెడ్, పర్భణి, లాథూర్ జిల్లాలోని మల్లయోధులు భారీగా తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. 7 గంటల పాటు హోరాహోరీగా సాగాయి. చివరి మూడు కుస్తీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ. 3, 5, 7 వేల నగదులను బహుమతిగా అందజేశారు. కుభీర్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘట్టి బందోబస్తు నిర్వహించారు. కుస్తీపోటీలను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు వి. మోహన్, చిమ్మన్ పోశెట్టి, తూం రాజేశ్వర్, కే. గజ్జెన్న కే. బాబు, సురేష్, చంద్రకాంత్, రాంచందర్, సంతోష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముథోల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన మున్నూరు కాపు సంఘం ముథోల్ తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేష్ తల్లి అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ మాజీ శాసన సభ్యులు జి.విఠల్‌రెడ్డి ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయనవెంట కాంగ్రెస్ నాయకులు అఫ్రోజ్ ఖాన్ మాజీ, ఏ. శ్రీనివాస్ గౌడ్, తదితరులున్నారు.

## శ్రీపాదరావుకు ఘన నివాళి

రెబ్బెన, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆదివారం ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ ఆయన చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎస్ఈ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యసనాల బారిన పడొద్దు

లింగాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దని బంజారా దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ అన్నారు. మండలంలోని మోత్తిపటార్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు రామారావు మహారాజ్ చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని చెప్పారు. యువత భక్తిభావంతో ఉండేందుకు దీక్షలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మానానుజాదవ్, ఆడే లక్యానాయక్, మాజీ జడ్పీటీసీ ఆత్మారామ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు టీచర్ ఎంపిక

పెంబి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ క్రికెట్ పోటీలకు పెంబి మండలంలోని లోతర్య తండా గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు ఎస్. కిషోర్ ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఉద్యోగుల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తిలో కొనసాగుతూ అఖిల భారతస్థాయి క్రీడా పోటీలకు ఉపాధ్యాయ వృత్తి నుంచి నిర్మల్ జిల్లా నుంచి ఎంపికైన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం కిషోర్ కడెం మండలంలోని మద్దిపడగ గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. జాతీయస్థాయికి ఎంపిక కావడంతో పలువురు అభినందించారు.

## ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు

ఖానాపూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఖానాపూర్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని మొగల్పురాకు చెందిన మహమ్మద్ ఇర్షాద్, మహమ్మద్ జియా అనే ఇద్దరికీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నిర్మల్‌కు చెందిన మిర్యాల రాజ్యలక్ష్మి, మిర్యాల శ్రీనివాస్ అనే ఇద్దరూ నమ్మబలికారు. ఇందుకు వీరివద్ద నుంచి రూ.3.5 లక్షలు వసూలు చేశారు. డబ్బులు వసూలు చేసి ఇటు ఉద్యోగం ఇప్పించకుండా అటు డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసగిస్తున్న వీరిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ పేర్కొన్నారు.

## రైలు పట్టాలపై మహిళ మృతదేహం గుర్తింపు

కాగజ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని 3వ ప్లాట్ ఫాం రైలు పట్టాలపై ఆదివారం మహిళ మృతదేహాన్ని గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. మహిళ వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. తెలుపు, ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించిందని, వయస్సు 40 సంవత్సరాలుపై బడి ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతి చెందినట్లు భావిస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చులో గదిలో భద్రపరిచామని తెలిపారు.

## బోరు నీరే దిక్కు

● నెల రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీరు

సిర్పూర్(టి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారులకు వేసవి ప్రారంభం కాగాన రక్షిత మంచినీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా పలు కాలనీలో ప్రజలకు నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ, బస్టాండు ఏరియాలో నెల రోజులుగా భగీరథ నీరు సరఫరా కావడం లేదు. పైప్‌లైన్‌లో తలెత్తిన సమస్య వల్లే నీరురావడం లేదని చెబు తున్నారు. దీంతో ఆయా కాలనీ వాసులు బోరు, వాగుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఫిల్టర్ నీటిని కొనలేక బోరు నీటినే వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికా రులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈవో బి తిరుపతిని వివరణ కోరగా మండల కేంద్రం లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్‌కు కొత్త ప్లేట్లు అమర్చి నప్పటికీ నీరు సరఫరా కావడం లేదని చెబు తున్నా రు. ఆయా కాలనీల్లో నీటి సరఫరాకు ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రజ లు ఆందోళన చెందొద్దని ఆయన కోరారు.


బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

## శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

కౌటాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 30ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కౌటాల మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. మొదటి రెగ్యులర్ లైబ్రేరియన్ ఉండడంతో పాటు సౌకర్యాలు కల్పించారు. దీంతో నిరుద్యోగులకు ఎంతో అందుబాటులో ఉండేది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేరు. దీంతో పాటు గ్రంథాల య భవనం కూడా శిథిలావస్థకు చేరు కుంది. దీంతో పాఠకులు, నిరుద్యోగు లు గ్రంథాల యానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లోని యువతకు అందుబాటులో ఉన్న గ్రంథాలయాన్ని పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆ గ్రంథాలయం సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయం భవనం నిర్మించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఇద్దరు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు

● బెయిల్‌కు నిందితుల దరఖాస్తు ● నేడు విచారణ

నర్సాపూర్ (జి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు సాయిని మోహన్ రావు, ఏ.మనోహర్ రెడ్డిలపై పోక్సో కేసు నమోదు చేసి నెల అయ్యింది. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బద్రి లక్ష్మి విశారద నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావు హైకోర్టులో ఫిబ్రవరి 13న క్యాష్ పిటిషన్ వేశాడు. ఫిబ్రవరి 18న ఎస్టీసీ పెటరీ బెయిల్ దరఖాస్తు చేశాడు. గణితం బోధించే ఏ.మనోహర్‌రెడ్డి ఫిబ్రవరి 13న హైకోర్టులో ఎస్టీసీ పెటరీ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇద్దరు ఉపాధ్యాయులు వేసిన పిటిషన్లు (నేడు) సోమవారం విచారణ జరగనున్నాయి. సోమవారం బెయిల్ రాకపోతే అరెస్టు చేస్తారని, ఇద్దరు ఉపాధ్యాయులు పోలీసులకు ఆచూకీ తెలియకుండా ప్రయత్నిస్తున్నారని అన్నారు. విద్యార్థులను వేధించిన ఉపాధ్యాయులకు శిక్ష పడుతుందనే నమ్మకంతో ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు.

# ఆదర్శం.. ఈ ఉపాధ్యాయుడు

● గోండు భాషలో పుస్తకాల రచనలు ● ఏఐ యాంకర్‌తో గోండు భాషలో వార్తలు ● గోండు భాషలో యూ ట్యూబ్ ఛానెల్
● గిరిజన భాషల సంరక్షణకు కైలాస్ కృషి ● ప్రధాని ప్రశంసలు పొందిన ఉపాధ్యాయుడు



రాష్ట్రస్థాయి ఉత్తమసేవా పురస్కారం రోషయ్య చేతుల మీదుగా అందుకుంటున్న దృశ్యం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే గిరిజన ఉపాధ్యాయుడు.. పాఠశాలలోని పిల్లలకు పాఠాలు బోధించడం తన వృత్తి.. అయితే.. తన మాతృ భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు దాని గొప్పదనాన్ని తెలియజేసేందుకు ఆయన కృషి చేస్తున్నారు. తమ ఆదివాసులకు తన వంతు ఏదైనా చేయాలన్న తపనతో.. గోండు, కొలామి భాషలలో పాటలను, పుస్తకాలను రాసి తెలుగులో అనువదించారు. ఆదివాసులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివాసులకు చదువుకోవడానికి భాషాపరమైన ఇబ్బందులు పడుతున్నట్లు గ్రహించి..వారి అభివృద్ధికై పాటు పడుతున్నాడు. ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన, భాషలను పరిరక్షించడంలో ముందడుగు వేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆ గిరిజన ఉపాధ్యాయుడిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాఘాపూర్‌కు చెందిన గోండ్ తెగకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గోండి భాష పరిరక్షణకు నడుం బిగించాడు. గోండు తెగల వారికి అర్థం అయ్యే రీతిలో, ముఖ్యంగా యువత ఈ గోండి భాష పట్ల పట్టు సాధించేందుకు గోండి భాషలో పలు పుస్తకాలను రాస్తున్నారు. వివిధ రకాల పుస్తకాలను గోండి భాషలోకి అనువదించి తన మాతృభాష పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

### గోండు భాషలో పుస్తకాలు రాసిన కైలాస్

తొడసం కైలాస్.. మహా భారత్ పుస్తకాన్ని గోండు భాషలో అనువాదించాడు. అది కూడా కేవలం మూడు నెలల్లోనే.. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో గోండు భాషను చేర్చడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మహా భారతంలోని కథలను చిన్నతనంలో తల్లిదండ్రుల నుంచి విని, వీధి నాటకాలు, టీవీలలో చూసిన కైలాష్ స్ఫూర్తి పొందారు. రామ కృష్ణ మఠం వారు అయిదు సంపుటాల్లో వెలువరించిన బాలల మహాభారాతాన్ని కరోనా సమయంలో తన మాతృభాష గోండులోకి అనువదించారు. 18 పర్వా లతో 272 పేజీల "పండోక్న మహా భారత్ కథ" పేరిట పుస్తకాన్ని అనువదించారు. పిల్లలు, యువతలో మంచి ఆలోచనలు కలిగించడానికి 'సద్ విచార్' పేరిట మరో పుస్తకం రాశారు. అదేవిధంగా చిన్న పిల్లల కథలకు 'కాండీరంగ్ వేసుడింగ్' పేరిట చిన్నపిల్లల కథల పుస్తకాన్ని రాసి అనువదించారు.

### గోండు భాషలో యూట్యూబ్ ఛానెల్..

విద్యార్థులలో నైతిక విలువలు పెంచడానికి ప్రజలకు వార్తలు అందించడానికి గోండు భాషలో ఒక యూట్యూబ్ ఛానెల్ నడుపుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుంది. మహాభారతంపై గిరిజనుల్లో అమిత ఆసక్తి ఉన్న, చదువుకోవడానికి భాషాపరమైన ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. దాంతో ఆ గ్రంథాన్ని గోండు భాషలోకి తెలుగు లిపిలో అనువదించారు.




మ్యూజిక్ కంపోజ్ చేస్తున్న కైలాస్

### కైలాస్‌కు ప్రధాని ప్రశంసలు

ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గిరిజన, భాషలను పరిరక్షించడంలో తమకు సాయం చేశారని ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారని తెలిపారు. ఏఐ రంగంలో భారతదేశం వేగవంతమైన పురోగతి సాధిస్తోందని ప్రపంచం మెచ్చుకుంటోందని వెల్లడించారు. ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### మోదీ ప్రశంసలను ట్వీట్ చేసిన కిషన్ రెడ్డి

ఆదిలాబాద్ ఉపాధ్యాయుని గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ విశేషమైన కృషిని గుర్తించారు. కైలాష్ ఏఐ ఆధారిత డిజిటల్ పాటలు, ద్వారా మన గిరిజన భాష లను సంరక్షించడంలో అద్భుతమైన పని చేస్తున్నారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి, ఇతర గిరిజన భాషలలో పాటలను కంపోజ్ చేయడంలో అతని చొరవ, మన భాషలు, సంస్కృతిని రక్షించడానికి సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చనేదానికి అద్భుతమైన ఉదాహరణ అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు.



తొడసం కైలాస్ అనువదించిన మహాభారత్ కథ



2018 సంవత్సరంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న దృశ్యం



కైలాస్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా




కైలాస్ రాసిన చిన్న పిల్లల కథల పుస్తకం

### ఆదివాసులకు అక్షర జ్ఞానం అందించేందుకు కృషి చేస్తా

● తొడసం కైలాస్, ఉపాధ్యాయుడు



గోండు, కొలమి ఆదివాసీ వాడకం భాషను నేను తెలుగులో ఉన్నది ఉన్నట్లుగా పేర్కొంటూ పుస్తకాలు రాశాను. అలాగే యూట్యూబ్ ఛానెల్ దీని కోసం సమర్థవంతంగా నడుపుతున్నాను.. ఏఐ యాంకర్‌ను ఉపయోగించి ఆదివాసులకు అర్థమయ్యేలా వార్తలు ప్రసారం చేస్తున్నాను.. వీటికి బాగా స్పందన వస్తున్నది.. వారి భాషల్లోనే మాట్లాడిన బోధించిన సంతోషంగా గ్రహిస్తారు.. దాని కోసమే నా ఈ ప్రయత్నం.. భవిష్యత్‌లో ఆదివాసులకు మరింత మెరుగ్గా అక్షర జ్ఞానం, విజ్ఞానం అందేలా కృషి చేస్తాను. దేశ ప్రధాని నుంచి ప్రశంసలు పొందడం ఎప్పటికీ మర్చిపోలేను.. అది మరింత ఉత్సాహాన్ని నింపింది.



ఫొటో న్యూస్

## శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల



గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమకు చేయుతను ఇస్తున్నామని అధికార యంత్రాంగం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అందుకు బోరజ్ మండల కేంద్రంలోని పశువైద్యశాల నిదర్శనంగా నిలుస్తుంది. కనీస వసతులు లేక శిథిలావస్థకు చేరిన భవనంలో పశు వైద్యశాల ఏర్పాటు చేయడంతో పశు పోషకులకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామంలోనే ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అన్ని వసతులతో కూడిన భవనాన్ని అందుబాటులోకి తీసుకు రావాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

●(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

## రైతుల పొలాలకు అందని సాగునీరు

బోథ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరత్వాడ చెరువు కింద సాగవుతున్న భూములకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్మించిన చెరువు నీరు రైతుల పొలాలను తడపలేకపోతున్నది. తక్కువ కాలువ కింద వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు చెరువు నిర్మాణం కొనసాగించారు. అయితే ప్రతీ ఏడాది ఎడమ కాలువ ద్వారా నీరు సరఫరా అవుతుండగా కుడి కాలువ కింద మాత్రం రైతులకు నీరు అందడం లేదు.



రైతులు పూడిక తీయించిన కరత్వాడ చెరువు కుడి కాలువ

● **చివరి ఆయకట్టుకు చేరని నీరు**

కుడి కాలువ కేవలం వంద ఎకరాల రైతన్నకి సాగునీరు అందిస్తుండగా ఎడమ కాలువ ద్వారా నీరు పారుతున్న చివరి ఆయకట్టు రైతాంగానికి అందడం లేదని వాపోతున్నారు. చెరువు మండలంలోని కనుగుట్ట, కౌటా(బి) గ్రామాల రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే కాలువ మధ్యలో రైతులు మోటార్లు బిగించి నీటిని వినియోగిస్తుండగా మరి కొంతమంది రైతులు అడ్డుకట్టలు వేసి తమ పొలాలకు నీటిని తీసుకు వెళుతున్నారు. దీనితో కేవలం నీరు కొంతమంది రైతుల భూములను తడుపుతున్నదే కానీ చివరి ఆయకట్టుకు చేరడం లేదని వాపోతున్నారు.

● **కాలువ పూడికకు రూ.70 వేల ఖర్చు**

కుడికాలువ ద్వారా సాగునీరు అందుతుందన్న ఆశతో కొంతమంది రైతులు 70 వేల ఖర్చు చేసి జెసిబీ ద్వారా కాలువలో నిండిన మట్టిని తొలగించారు. అయితే పూడిక తీసిన సాగు నీరు మాత్రం అందడం లేదని రైతులకు వాపోతున్నారు. కుడికాలువ తూము వద్ద ఎత్తుగా ఉండడంతో నీరు తూము వద్దకు రావటం లేదని, దీంతో కుడికాలువ కింద సాగు అవుతున్న భూముల వారికి నిరాశనే మిగిలింది. దీంతో రబీ పంట సాగుపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

● **కాలువలకు నీరు చేరే విధంగా చర్యలు తీసుకోవాలి**

కుడి కాలువ ద్వారా నీరు అందించేందుకు గాను అధికారులు చెరువు లోపల నీటిని అందించేందుకు మట్టిని తొలగించి సాగునీరందేలా చూడాలని ఆకట్టు రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదన పంపించాల్సిన అవసరం ఉంది.



బరంపూర్ కొండపై వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు





బ్రహ్మోత్సవం సందర్భంగా స్వామి వారిని అలంకరించిన భక్తులు

## బరంపూర్ కొండపై కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం

● **గోవింద నామస్మరణతో మార్మోగిన బరంపూర్ తిరుమలకొండ**

తలమడుగు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీదేవి-భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు స్వస్తిక్, వేణుగోపాల శర్మ, నేరెళ్ల కళ్యాణ్ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో బరంపూర్ తిరుమలకొండ మార్మోగింది. కల్యాణంలో వరుడు తరపు నుంచి బరంపూర్ వాస్తవ్యులు మెరుగు మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించాఉ. వధువు తరపున అర్లి(కె) గ్రామానికి చెందిన మైన సురేష్ దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.

కల్యాణాన్ని తిలకించడానికి చుట్టు పక్క గ్రామాల ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి స్వామి వారి భక్తులు తరలివచ్చారు. కల్యాణాన్ని కన్నుల పండుగగా తిలకించారు. వచ్చిన భక్తులకు బరంపూర్ గ్రామస్థులు మాదారి పరివారం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వేద పండితులు వేణుగోపాల శర్మ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని, సోమవారం మహా సుదర్శన యాగం ప్రత్యేక అభిషేకం, మూడవ రోజు మంగళవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం, అన్నమయ్య లడ్డూ వేలం నిర్వహించడం జరుగుతుందని స్వామి వారి భక్తులు హాజరై కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్‌రెడ్డి, తలమడుగు సహకార సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి, కోశాధికారి బరకం మల్లేష్, నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, మెరుగు మోహన్‌రెడ్డి, మాదారి మల్లేష్, రాజేందర్, మాదారి రమాకాంత్, పొట్టిపెల్లి శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, కస్తాల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



బరంపూర్ కొండపై నిర్వహించిన శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు




పూజలు నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి మాల మహిళా దీక్షపరులు

## 30 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

నేరడిగొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోలి గ్రామ సమీపంలో 30 అడుగుల ఎత్తైయిన హనుమాన్ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బోథ్ మండల పండితుడు సదానంద శర్మ పండరి ఆధ్వర్యంలో ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తేజాపూర్, చించోలి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు నేరేడిగొండ, బోథ్ మండల వ్యాప్తంగా ఉన్న హనుమాన్ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.










● నర్సాపూర్(బి) వాగులో నడుచుకుంటూ వెళ్తున్న గిరిజనులు



● అడవి మార్గం గుండా ఉన్న శాంతాపూర్ తాత్కాలిక రోడ్డు



వంకతుమ్మ వాగుపై వంతెన లేని దృశ్యం



వంకతుమ్మ వాగులో నడుచుకుంటూ వెళ్తున్న ఎమ్మెల్యే బొజ్జు(ఫైల్)

# రోడ్ల అభివృద్ధికి.. అనుమతులేవి?

- జిల్లాలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి అనుమతులు ఇవ్వని అటవీ శాఖ?
- రూ.57.99 కోట్ల ప్రతిపాదనలు పెండింగ్
- స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా.. తీరని గిరిజనుల కష్టాలు
- వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- వాగులు పొంగిపొర్లడంతో గ్రామాలకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో పలు గిరిజన ప్రాంతాలకు కరువైన రోడ్డు సౌకర్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆదివాసీల ఆశలు

ఉట్నూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యాలు లేక గిరిజన ప్రాంతాల ప్రజలు ఇంకా కష్టాలు పడుతూనే ఉన్నారు. వర్షాకాలంలో వాగులు దాటలేక.. బాహ్య ప్రపంచంతో సంబంధాలు కొనసాగించ లేకపోతున్నారు. అంతేకాకుండా గ్రామాలకే పరిమితమవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల గిరిజనుల కష్టాలు వర్ణనాతీతం. పాలకులు రోడ్లు నిర్మించాలని భావిస్తున్నా.. అటవీ శాఖ అడ్డంకులు గిరిజనులను వెంటాడుతూనే ఉన్నాయి.

## అనుమతులు ఇవ్వని అటవీ శాఖ

జిల్లాలోని గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు కృషి చేస్తున్నా.. దశాబ్దాలుగా అటవీ శాఖ అనుమతులు రాక రోడ్ల నిర్మాణాలు జరగడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక కూడా గిరిజన ప్రాంతాల ప్రజల కష్టాలు తీరడం లేదు. దీనిలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో గల ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(జె) గ్రామానికి దంతన్‌పల్లి నుంచి ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 2018లో ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసి మూడు వంతెనలు నిర్మించాలని భావించింది. అయితే, ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న మూడు వాగులకు వంతెనలు నిర్మించాలని భావించారు. రెండు వంతెనలు నిర్మించినా.. అటవీ శాఖ అధికారులు అర కిలోమీటర్ రోడ్డుతో పాటు ఒక వంతెన అటవీ శాఖ పరిధిలో ఉందని అడ్డుకున్నారు. ఇదే కాకుండా మండలంలోని వంకతుమ్మ వాగుపై వంతెన నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. 2013లో ఈ ప్రాంతంలోని ఆరు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ ద్వారా రూ.6 కోట్లు మంజూరు చేయగా.. మొరం రోడ్లు నిర్మించారు. కానీ వంకతుమ్మ వాగుపై వంతెన లేకపోవడంతో ప్రతియేటా వర్షాకాలంలో నాలుగు నెలల పాటు ఆరు గిరిజన గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కొనసాగించ లేకపోతున్నారు. వ్యాధులు ప్రబలి గిరిజనులు అనారోగ్యంతో మృతి చెందిన సంఘటనలు లేకపోలేదు. అంతేకాకుండా వర్షాకాలంలో వాగు వద్ద నిండు గర్భిణి సైతం వాగు దాటలేక మృత్యువుకు గురైంది. ఇటీవల ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సైతం వంకతుమ్మ గ్రామాన్ని సందర్శించడానికి వెళ్లగా.. తన వాహనం వెళ్ల లేక పోవడంతో ట్రాక్టర్‌పై గ్రామానికి చేరుకొని గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని రాజులమడుగు, శాంతాపూర్, మత్తడిగూడ, వడగల్పూర్, జెండాగూడ, బలాన్పూర్, భూపేట, దేవాపూర్, అల్లిగూడ, చెరువు గూడెం, పిట్టగూడ, ఉమాపతికుంట, కోలంగూడ, అడ్డాన్‌గూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు నిర్మించాల్సి ఉంది.

## పెండింగ్‌లో ప్రతిపాదనలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల గ్రామాలకు రోడ్లు నిర్మించాలని భావించిన ఐటీడీఏ అధికారులు ప్రభుత్వానికి పంపించిన రూ.57.99 కోట్లతో చేపట్టదలచిన రోడ్ల పనులకు అనుమతులు లభించడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నేరడిగొండ, బోథ్, బేల, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్, తలమడుగు మండలాల్లోని 28 గ్రామాలకు 61కిలోమీటర్ల రోడ్లను రూ.38.23 కోట్ల వ్యయంతో నిర్మించాలని భావించగా.. 40కిలోమీటర్ల రోడ్లు అడవుల గుండా ఉన్నాయి. అదేవిధంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి,

(తరువాయి 6వ పేజీలో...)



### రోడ్లకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలి
**: మెస్రం దుర్గు పటేల్, జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలి. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా.. ఏజెన్సీ ప్రాంతంలోని పలు గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగానే ఉన్నాయి.

### అటవీ శాఖ అనుమతులు వస్తే రోడ్ల నిర్మాణం
**: జాదవ్ తానాజి, ఈఈ ఐటీడీఏ, ఉట్నూర్**



ఉమ్మడి జిల్లాలోని గిరిజన గ్రామాలలో రోడ్లు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖకు రోడ్ల అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే రోడ్లు నిర్మిస్తాం.



నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

## దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరవలేనివి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు చేసిన సేవలు మరవలేనివని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. దుద్దిళ్ల శ్రీపాద రావు అధికారిక జయంతి కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జడ్పీ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## తాంసిలో పోచమ్మకు బోనాలు

తాంసి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగను ఆదివారం తాంసి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉదయం నుంచే గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. మేలతాళాలు, వాయిద్యాలతో తలపై బోనాలు పెట్టుకుని పోచమ్మ గుడిలోకి వెళ్లి నైవేధ్యాలు సమర్పించారు. మొక్కులను తీర్చుకుని పండుగ జరుపుకున్నారు. తాంసి మండల కేంద్రంతో పాటు జామిడి, గొట్కూరి, సావర్గావ్ గ్రామాలలో కూడా పోచమ్మకు ఒకే రోజు బోనాలు సమర్పించారు. మొత్తం మీద బోనాల సందర్భంగా ఆయా గ్రామాలు ఆడపడుచులతో కలకలలాడాయి.



పోచమ్మకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

● మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు ● జిల్లాలో 31 సెంటర్ల ఏర్పాటు ● పరీక్షలకు హాజరు కానున్న 18,880 మంది విద్యార్థులు ● ఓటీపీతో హాల్ టికెట్ డౌన్‌లోడ్
● నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ ● గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని అధికారుల సూచనలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం అయింది. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధన వర్తిస్తుందని సబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు గంట ముందుగానే ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలని సూచిస్తున్నారు. అధికారులు పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.తాగునీరు, విద్యుత్, పర్నీచర్, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షలపై సంబంధిత అధికారులకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ రాజర్షి షా పలు సూచనలు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ఫోన్ నెం. 08732 - 297115, సెల్ నెం. 98487 81808లలో సమాచారం అందించాలని డీఐఈవో గణేష్ జాదవ్ పేర్కొంటున్నారు.



### ● పరీక్షలకు 18,880 మంది విద్యార్థులు

ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తంగా 18,880 మంది ఉన్నారు. ఇందులో ఇంటర్మీడిట్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,093, అలాగే ఒకేషనల్ 1,013 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,754 మంది, విద్యార్థులు 1020 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు -13, సాంఘిక సంక్షేమ-5, ట్రైబల్ వెల్ఫేర్-2, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు -9 మోడల్ స్కూల్ -1, మైనార్టీ స్కూల్-1 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### ● పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయా జిల్లా కలెక్టర్ ఇప్పటికీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా వారికి వీలుగా బస్సులు నడిపించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. గదుల్లో చీకటి ఉండకుండా లైట్లు, వేసవి నేపథ్యంలో ఉక్కపోత సమస్య అధిగమించేలా గదుల్లోని అన్ని ఫ్యాన్‌లు పనిచేసే విధంగా ఏర్పాట్లు చేశారు. వద్ద వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు పెట్టనున్నారు. ఆశా వర్కర్లు, పరీక్ష కేంద్రాల వద్ద ఉండి ఫస్ట్ ఎయిడ్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టనున్నారు.

### ● క్యూ ఆర్ కోడ్‌తో సెంటర్ లోకేషన్, వివరాలు

ఇంటర్ పరీక్షల సమయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరిట వేధిస్తూ.. హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తుంటాయి. దీంతో పలువురు విద్యార్థులు పరీక్షలకు దూరమవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లకు ఓటీపీ పంపనున్నారు. దీని ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫోన్‌లకు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ ద్వారా హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇంటర్ బోర్డు మొదటిసారిగా హాల్ టికెట్‌పై క్యూఆర్ కోడ్ ముద్రించారు. ఈ కోడ్ స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రం వివరాలు, లోకేషన్ కనిపిస్తాయి. విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

### ● పరీక్షలకు పకడ్బందీ చర్యలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.ఇందులో భాగంగా సీఎస్ - 31, డీవోలు - 31, కస్టోడియన్‌లు- 3, సిట్టింగ్‌స్క్వాడ్- 2, ఫ్లయింగ్ స్క్వాడ్- 2 ఏర్పాటు చేశారు. వీరితో పాటు హై పవర్ కమిటీని నియమించారు. ఈ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, డీఐఈఓ, సీనియర్ ప్రిన్సిపల్, సీనియర్ లెక్చరర్‌లు సభ్యులుగా ఉంటారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా వీరు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపడుతారు.

### మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు
**: గణేష్ జాదవ్, డీఐఈవో, ఆదిలాబాద్**



ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు. ఎట్టి పరిస్థితుల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చూస్తాం.. ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రోత్సహిస్తాం.

### రంజాన్ వేళలు

| సోమవారం | మంగళవారం |
|---|---|
| ఇఫ్తార్ సా.6.28 | సహర్ ఉ.5.10 |



ఎవరైతే అల్లాహ్‌కు విధేయతను పాటించడంలో తన మనోకాంక్షలతో పోరాడుతాడో.. అతడే నిజమైన ముజాహిద్(యోధుడు).

### ఆదర్శం.. ఈ ఉపాధ్యాయుడు

● గోండు భాషలో పలు పుస్తకాల రచనలు
● గిరిజన భాషల సంరక్షణకు ఎనలేని కృషి
● ప్రధాని ప్రశంసలు పొందిన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్



మరిన్ని వివరాలు 7వ పేజీలో..

## బరంపూర్ కొండపై కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం



బరంపూర్ కొండపై స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

7లో..

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
ఆదిలాబాద్ - 93983 85917
ఇచ్చోడ - 85000 38312
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451